క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



పాన్‌గల్: విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రార్థనకు తప్పక హాజరు కావాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. యూనిఫాం, పుస్తకాలు అందరికీ అందాయా లేదా అనే విషయాలపై ఎంఈఓ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిల్వ నీటితో రోగాలు



పాన్‌గల్: నిల్వ నీటితో రోగాలు సంభవిస్తాయని, వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని డీటీ, గ్రామ ప్రత్యేకాధికారి అశోక్‌నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు కాలనీలు, నర్సరీని పరిశీలించారు. గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాలనీలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని ఆయన ఉపాధి సిబ్బందికి సూచించారు.

సాహు మహరాజ్‌కు ఘన నివాళి



వనపర్తి టౌన్: భారతదేశ రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహూ మహారాజ్ అని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సాహు మహరాజ్ 150వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, ముస్లిం మైనార్టీ నాయకుడు బాలేమియా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంధం గట్టయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన తెలుగు బిందు పాముకాటుగురై చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, స్థానిక నాయకులతో కలిసి బుధవారం గ్రామంలో మృతురాలికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో విష్ణు, కుమ్మరి గోవిందు, రాముడు, మద్దిలేటి, రామరాజు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం



పెబ్బేరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001–02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన కవిత భర్త వెంకటేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పట్లో తనతో పాటు 10వ తరగతి చదువుకున్న తన తోటి స్నేహితులు గోపాలకృష్ణ, చంద్రకళ, రాధ, షర్మిష్ఠ, గోనెల నరసింహ, రమేష్, నాగరాజు, శివ, చంద్రశేఖర్, రాఘవేంద్ర, మనోహర్, బాలరాజు, ఉమాశంకర్, తోటి స్నేహితులతో రూ.50 వేలు పోగుచేసి బుధవారం స్నేహితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆమె కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

కొల్లాపూర్‌లో వర్షం

కొల్లాపూర్: నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. రోజంతా చల్లటి వాతావరణం నెలకొంది. రాత్రి కూడా చల్లటి గాలులు వీచాయి. పంటలకు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక రైతులకు కురిసిన వర్షం కొంత ఉపశమనం ఇచ్చింది.

ఇసుక మాఫియాకు అడ్డేది?

- మండలంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం
- ఫిల్టర్ ఇసుక దందాతో రూ.లక్షల వ్యాపారం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- చెరువుల్లోని మట్టితో సైతం ఇసుక తయారు చేస్తున్న వైనం



రేవల్లి మండలంలోని కేశంపేట చెరువులో అక్రమంగా నిల్వ చేసిన మట్టిని సీజ్ చేస్తున్న అధికారులు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఇసుకాసురుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. ఉమ్మడి మండలంలో ఎక్కడా వాగులు లేకపోయినా వ్యాపారులు చిన్నపాటి కాల్వల్లో మెత్తటి మట్టిని తవ్వి ఫిల్టర్ చేసి ఇసుకగా తయారు చేసి అమ్ముకుంటున్నారు. ఇటువంటి ఇసుక తయారు చేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుండడంతో పాటు నాసీరకం ఇసుకను అమ్మడం వల్ల నిర్మాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుకాసురులు చెరువులు, వాగులు, పొలాల్లో ఉన్న మట్టిని సైతం సంవత్సరానికి కొంత డబ్బును యజమానికి ఇచ్చి లీజుకు తీసుకుంటున్నారు. పొలంలోని మట్టిని వాగులు లేదా నీరు ఉన్న ప్రాంతాలకి తరలించి ఫిల్టర్ చేసి ట్రిప్పుకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల రేవల్లి మండలంలో సుమారు 300 ట్రిప్పుల మెత్తటి మట్టిని తహసీల్దార్ లక్ష్మీదేవి, గోపాల్‌పేట మండలంలోని చాకల్‌పల్లిలో సైతం 300 ట్రిప్పుల మెత్తటి మట్టిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అధికారులు మరింత చొరవ తీసుకుని చెరువుల్లోని మెత్తటి మట్టిని కేవలం రైతులు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రేవల్లి మండలంలో బండరావిపాకుల, కొంకలపల్లి, ఏదుల రిజర్వాయర్ సమీప ప్రాంతాలు, వీటితో పాటు కేశంపేట పాతతండా, కొత్తతండా, తల్పునూరు శివారు ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రం నుంచి చెన్నూరు వెళ్లే దారిలోని వాగు పరిసర ప్రాంతాలు, పొలికెపాడు శివారు ప్రాంతాలు, ఏదుట్ల నుంచి మున్ననూరు వెళ్లే రోడ్డులో, లక్ష్మీదేవిపల్లి శివారు ప్రాంతాల్లో ఇసుకాసురులు యథేచ్ఛగా మట్టిని ఫిల్టర్ చేసి కుప్పలుగా పోసుకుని రాత్రి సమయంలో జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రేవల్లి మండలంలో ఎక్కువ మొత్తంలో ఫిల్టరింగ్ చేసి ఏదుల, రేవల్లి, కొత్త బండరావిపాకుల, నాగర్‌కర్నూల్‌కు సైతం పంపిస్తున్నారని తెలిసింది. ఫిల్టర్ ఇసుకతో కట్టడాలు ఎక్కువరోజులు మన్నిక ఉండవని తెలిసినా.. సమీప ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులు తమ ఇంటి నిర్మాణం కోసం ఇదే ఇసుకను వాడుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఫిల్టర్ ఇసుక దందాను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి గోపాల్‌పేట మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



రేవల్లి మండలంలోని కేశంపేట చెరువులో మెత్తటి మట్టిని తీసి ఫిల్టర్ చేసి అమ్ముతున్నారని సమాచారం రాగా రెవెన్యూ అధికారులతో వెళ్లి సుమారు 300 ట్రిప్పుల వరకు మెత్తటి మట్టిని సీజ్ చేశాం. చెరువుల్లో కేవలం రైతులు వారి పొలాలకు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉంటుంది. చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం

– తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ, రేవల్లి మండలం

సీఎంఆర్ ఇవ్వని మిల్లులు సీజ్‌చేస్తాం



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: మిల్లర్లు వారం రోజుల్లోగా సీఎంఆర్ అప్పజెప్పకుంటే రైస్‌మిల్లులను సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యం మిల్లర్లకు అప్పగించినట్లు వివరించారు. ఆత్మకూర్‌లోని మిల్లర్లు 75 ఏసీకే సుమారు 21 వేల క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్‌కు ఇవ్వాల్సి ఉందన్నారు. రెండేళ్లుగా రైస్‌మిల్లర్లు బియ్యం సీఎంఆర్‌కు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిర్దేశించిన సమయంలోగా బియ్యం అప్పజెప్పకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పులిమామిడి రమేష్‌శెట్టి, జిల్లా నాయకులు బిలకంటి గోవర్ధన్‌శెట్టి, కల్వ వెంకటేష్‌శెట్టి, సతీష్‌కుమార్, ఎస్‌ఎస్ బాబు తదితరులు ఉన్నారు.

శుభ్రతను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

వనపర్తి/కొత్తకోట: పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంతో పాటు కొత్తకోట పట్టణంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మున్సిపాలిటీల్లోని సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్, కొత్తకోట పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ప్రధాన డ్రైనేజీ నిర్వహణపై సిబ్బంది సూచనలు చేశారు. శానిటేషన్ సిబ్బంది డ్రైనేజీలను శుభ్రపరచే సమయంలో గ్లౌస్, బూట్లు ధరించాలని, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వనపర్తిలోని పాత యూకో బ్యాంకు వద్ద కొనసాగుతున్న బీటీ రోడ్డు విస్తరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులపై మలుపుల వద్ద సేఫ్టీ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు.



వనపర్తిలో పర్యటిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, మున్సిపల్ అధికారులు

నర్సరీల పరిశీలన

జిల్లా కేంద్రంలోని శ్రీనివాసపురంలో ఉన్న నర్సరీని, కొత్తకోట పట్టణంలో ఉన్న నర్సరీని కలెక్టర్ పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను చెక్ చేశారు. నర్సరీల్లోని పెద్ద మొక్కలను అవసరమైన చోట నాటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజమే లక్ష్యం

ఖిల్లాఘనపురం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖిల్లాఘనపురం ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల నుంచి పోలీసులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఖిల్లాఘనపురం బస్టాండు వరకు ర్యాలీ తీశారు. బస్టాండులో అందరితో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ శ్రీహరి ప్రసంగించారు. యువత గంజాయి, కొకైన్, ఎల్‌ఎస్‌డీ, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు అలవాటై బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తులో ఏంచేస్తున్నారో కూడా తెలియకుండా జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత తప్పుదారిలో నడవకుండా ఉండేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఇలాంటి మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నట్లు తెలిసిస్తే వెంటనే 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాళిదాసు, క్లాస్‌మేట్ సంస్థ మండల అధ్యక్షుడు విశ్వనాథం, ఏఎస్‌ఐ సత్యనారాయణ, నాయకులు ప్రకాష్, గంజాయి రమేష్, అజీమ్, యాదగిరి, ఉపాధ్యాయులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



ఆత్మకూర్: మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాలకమండలి సభ్యులు, పురపాలిక అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రాజు అన్నారు. బుధవారం కమిషనర్ నాగరాజుతో కలిసి వార్డుల్లో పర్యటించి స్థానిక గాంధీచౌక్‌లో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తు పారిశుద్ధ్యం లోపించడంతో అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా షాపుల ఎదుట మెట్లను తొలగించినట్లు సంబంధిత షాపుల యజమాని కోర్టును ఆశ్రయించడంతో డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. అలాగే ట్రీపార్కులు, నర్సరీలు, పట్టణ ప్రకృతివనాలు, ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులతో సమావేశమై పారిశుద్ధ్యం, తాగునీరు, దోమల నివారణ తదితర విషయాలపై స్థానికులకు అవగాహన కల్పించాలని వివరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాజశేఖర్‌రావు పెద్ద ముద్దునూర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవికుమార్, రాధ, భాస్కర్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

దంత వైద్యుడిని..

కొల్లాపూర్: పట్టణానికి చెందిన దంతు వైద్యుడు శ్యాంప్రసాద్‌ను ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సత్కరించారు. ఇటీవల వేకప్ తెలంగాణ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు బిల్లా యాదగిరి, రమేష్, జయచంద్రప్రసాద్‌యాదవ్, దిలీప్, షాహిద్, సూర్యనాయక్ ఉన్నారు.

అభివృద్ధికి కృషి

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల అభివృద్దే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధికారులతో ఎస్‌ఆర్‌ఈజీఎస్, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, త్రాగునీటి సమస్య వంటి పలు సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



అమరచింతలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు



కొత్తకోటలో విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు

కొత్తకోట రూరల్: విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ పూర్వ జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బందుకు మద్దతుగా కొత్తకోటలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మారితే పాలనలో మార్పులు వస్తాయని భావించినా.. ప్రభుత్వ యంత్రాంగంలో ఎలాంటి మార్పులు జరగలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పుకునే రేవంత్ సర్కార్ నేటి వరకు విద్యా శాఖ మంత్రిని నియమించలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో శివకుమార్, మహేష్, పరమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారంగా మార్చుతున్న ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక సరిపడా అధ్యాపకులు లేక నానా అవస్థలు పడుతుంటే మరొకవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు రూ.లక్షల ఫీజులు దండుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌పీడీ కన్వీనర్ అఖిల్, ఏబీవీపీ మండల కార్యదర్శి రాజేష్, విగ్నేష్, ఉదయ్‌గౌడ్, ఆదిత్య, వంశీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న సీసీ స్వామి

పాన్‌గల్: మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని ఐకేపీ సీసీ స్వామి అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో మహిళ సంఘాల సభ్యులకు రుణాల వినియోగంపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుంటూ కంతులను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీ సక్రమంగా అందడం లేదని, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణాలు అందించాలని గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు చిట్టెమ్మ కోరారు. సారా తయారీని మానుకున్న వారికి ఉపాధి కల్పించాలన్నారు. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవెళ్తానని సీసీ సభ్యులకు హామీ ఇచ్చారు. సమావేశంలో మహిళ సంఘం కార్యదర్శి శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు సాలమ్మ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నరేష్

పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురంలో రైతులకు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏఈఓ నరేష్ బుధవారం వరి, మెట్ట పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలను చదును చేసుకొని వడ్లను వెద జల్లుకోవాలని సూచించారు. ఈ పద్ధతి ద్వారా ఎకరాకు 10 నుంచి 12 కేజీల విత్తనం సరిపోతుందని ఆయన రైతులకు సూచించారు. ఈ పద్ధతి ద్వారా విత్తుకోవడం ద్వారా చాలా వరకు ప్రయోజనాలు ఉన్నాయని, 25 శాతం నీటిని ఆదా చేయవచ్చని, నారుమడి ఖర్చు, నాటు కూలి ఖర్చు రూ.6 వేల వరకు ఆదా అవుతుందన్నారు. విత్తనం జులై 10 తర్వాత విత్తుకోవాలని, కలుపు నివారణకు కలుపు మందు పిచికారీ చేసుకుంటే సరిపోతుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు మురళి, వెంకటస్వామి, కురుమన్న, శేఖర్, రామస్వామి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలని ఆందోళన



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్

- ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి అప్పగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

మదనాపురం: బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 500 బొగ్గు గనులు ఉండగా.. ఇప్పటికే 300 బొగ్గు గనులను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టారని, ఇప్పుడు 67 బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు శక్తులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. దీన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపడుతున్నామని పేర్కొన్నారు. గనులను ప్రైవేటు, కార్పొరేటు శక్తులకు కట్టబెట్టడానికి పదో విడత వేలం ప్రక్రియ మొదలు పెట్టారని, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కూడా వేలం వేయడం శోచనీయమన్నారు. ఈ బొగ్గు బ్లాకులను వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు టన్ను రూ.3,500 నుంచి రూ.4 వేల మధ్య అమ్మేశారని పేర్కొన్నారు. దీంతో టన్నుకి రూ.18 వేలకు ఏకంగా అదానీ కంపెనీ నుంచి రూ.17 లక్షల టన్నుల బొగ్గు కొన్నారని చెప్పారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జూన్ 28న జరిగే నిరసన కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకట్రాములు, కొత్తకోట మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, ప్రసాద్, విష్ణు, వెంకటేష్, మొగిలి, మణివర్ధన్, మాసన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్‌లకు మూడు రోజులపాటు పూర్వప్రాథమిక విద్యపై బుధవారం సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యపై, పిల్లలకు ఏవిధంగా విద్యను నేర్పించాలో, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శివకుమార్ ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ కోరారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కొంతకాలంగా వారి సమస్యలపై పోరాడుతుందన్నారు. బుధవారం ఏకో పార్కు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌యాదవ్ మాట్లాడుతూ పింఛన్ రూ.4వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వారికి మూడు చక్రాల బండి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాలు వెంటనే ఇచ్చి హామీలను నిలబెట్టు కోవాలన్నారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, గొల్ల శంకర్, విజయ్‌రాం, సుశీల, మహేశ్వరి, శాంతమ్మ, అన్నపూర్ణ, శేఖర్, శివకుమార్, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్‌యాదవ్